క్లుప్తంగా

మద్దిలో ప్రత్యేక పూజలు



మద్ది ఆలయానికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం హనుమన్నామ స్మరణతో మార్మోగింది. తెల్లవారు జామున ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు దేవస్థానానికి పలు సేవల, విరాళాల ద్వారా రూ.2,46,881 సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన కంచర్ల రామలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.1,00,251 విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. హనుమాన్ జంక్షన్, సీతారామ భజన సమాజం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్య నిర్వాహణాధికారిణి ఆర్వీ చందన తెలిపారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం జంగారెడ్డిగూడెం మండలంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి సి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పేరంపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, రెండు దుకాణాల్లో వ్యత్యాసాలు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో రెండు దుకాణాల్లో ఆన్‌లైన్ నిల్వలకు, పుస్తక నిల్వలకు మధ్య వ్యత్యాసం గుర్తించామన్నారు. శ్రీగాయత్రి ఎంటర్ ప్రైజెస్‌లో రూ.96,100 విలువైన 3.35 టన్నులు, శ్రీవాసవీ జనరల్ స్టోర్స్‌లో రూ.3,79,671 విలువైన 20.54 టన్నులు ఎరువుల వ్యత్యాసం గుర్తించామన్నారు. ఆయా దుకాణాల యజమానులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో జీ.మిరియ, పేరంపేట, పంగిడిగూడెం వీఏఏలు వి.స్వామినాయక్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన తప్పనిసరి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యలగూడెం: పీహెచ్‌సీలో నేత్ర అవగాహన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తామని చక్రవర్తి పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నేత్ర దానంపై ప్రతి కుటుంబంలో చైతన్యం పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమశంకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గంగాదేవి, పీహెచ్ఎన్ సుభద్ర కుమారి, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో, అధికారులు

లింగపాలెం: జిల్లా ముఖ్య కార్య నిర్వాహణ అధికారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఎం.శ్రీహరి మండలంలోని యడవల్లి గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీ నందు శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్తను సేకరించుట, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహనను కల్పించుట, ఎస్‌డబ్ల్యూపీసీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలను కలసి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు చెత్త రహితంగా ఉండాలన్నారు. ఎంపీడీవో కె.వాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, కార్యదర్శులు బి.బాలకృష్ణ, సుగుణరాజు, రాజు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు కొలువుదీరనున్న గణనాథులు
- జోరుగా పత్రి, పూలు, పళ్ల విక్రయాలు



ద్వారకాతిరుమల: గుడి సెంటర్‌లో పత్రి విక్రయిస్తున్న వ్యాపారులు



కుక్కునూరు: ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై



కామవరపుకోట: వినాయకుని ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

ద్వారకాతిరుమల: మండలంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే కమిటీ సభ్యులు మందిరాలను నిర్మించి, ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ద్వారకాతిరుమలలో 13 చోట్ల మందిరాలను నిర్మించి, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే తిమ్మాపురంలో ఉత్సవ ఏర్పాట్లను కమిటీ సభ్యులు భారీగా చేశారు. పలు ప్రాంతాల్లో కొలువు దీరనున్న గణేష్ విగ్రహాలు మంగళవారం సాయంత్రానికి లక్ష్మీపురం ఆలయానికి చేరుకున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి స్థానిక గుడి సెంటర్‌లో పత్రి, పూలు, పళ్లు, మట్టి వినాయకుని బొమ్మల విక్రయాలు జోరుగా సాగాయి. ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమైన విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయలేదు.

వినాయక చవితి సందడి

చింతలపూడి: వినాయక చవితి సందర్భంగా చింతలపూడి పట్టణంలో మంగళవారం పండగ వాతావరణం నెలకొంది. పూజా సామగ్రి కొనుగోళ్ల కోసం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా పలు ఆకృతుల్లో తయారు చేసిన మట్టి వినాయకుని విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. కూడళ్లలో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పందిళ్లు వేసి ఏర్పాట్లు చేశారు. ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని ఎస్సై కె.సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఉత్సవాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు

కుక్కునూరు: వినాయక చవితి ఉత్సవాలను ఆనందంగా భక్తి శ్రద్ధలతో చేసుకోవాలని ఎస్సై రాజారెడ్డి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్సై రాజారెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ముందుగా సంబంధిత పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని, ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పండుగ వాతావరణం

కామవరపుకోట: వినాయకుడి చవితి సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మండలంలోని రావికింపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినాయకుడి పండుగను విభిన్న రీతిలో చేసుకొని అందరి దృష్టిని ఆకర్షించారు. పాఠశాలలోని విద్యార్థులు వినాయకుని ఆకృతిలో ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

బుట్టాయగూడెం: వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని గ్రామ ప్రముఖుడు అల్లూరి రత్నాజీరావు అన్నారు. మండలంలోని రెడ్డి గణపవరంలో మంగళవారం ఎస్కేడీ ఈవెంట్స్, అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాలను గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో భౌమరాజు ధనుంజయరాజు, గన్నిన సూర్యచంద్రం, అల్లూరి సీతారామరాజు యూత్ ప్రతినిధి జి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పోలవరం రూరల్: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు తెలిపారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబులతో కలిసి ఆయన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో గణపతి నవరాత్రాలు మండపాలు ఏర్పాటు చేసినా సమాచారం ఇవ్వాలన్నారు. ఎటువంటి గొడవలు జరగకుండా తగిన భద్రతా చర్యలు పాటించేలా చూడాలని పేర్కొన్నారు.

మండపాలకు తరలిన గణనాథులు

కొయ్యలగూడెం: వినాయక చవితి పురస్కరించుకొని సిరియాల వద్దకు గణనాథులు తరలి వెళ్లారు. మంగళవారం కొయ్యలగూడెంలోని కోపరేటివ్ బ్యాంకు వీధిలో మండలంలోనే అతి పెద్ద భారీ వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం టౌన్‌లో 15 చోట్ల ఉత్సవాలను నిర్వహిస్తుండగా ప్రధానంగా గణేష్ సెంటర్‌లోని ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. పత్రి విక్రయాలు జోరుగా జరిగాయి.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



జంగారెడ్డిగూడెం: వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



లింగపాలెం: మట్టి విగ్రహాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సూర్య ఎంటర్ ప్రైజెస్ సౌజన్యంతో ప్రముఖ వ్యాపారవేత్త చామర్తి శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం డిజిటల్ నెట్వర్క్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్ విగ్రహాల పంపిణీ ప్రారంభించారు. మండలంలోని పట్టెన్నపాలెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని 7వ తరగతికి చెందిన బాలికలు టి.హిమబిందు, జి.గాయత్రి, విజయదుర్గ, టి.ఉషామానస, ఎం.షారోన్ రోజా, బి.శశిలేఖ్యశ్రీలు వివిధ గణపతి ఆకృతులను రావి ఆకులపై తీర్చిదిద్దారు. రోటరీ అధ్యక్షుడు పెనుమర్తి సురేష్ బాబు, కార్యదర్శి సంధ్యా ప్రవల్లిక, మానవత ప్రతినిధులు, చామర్తి మనోజ్, సూర్య ఎంటర్‌ప్రైజెస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం-పర్యావరణాన్ని రక్షిద్దాం

లింగపాలెం: పర్యావరణాన్ని కలుషితం చేసే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు వద్దు, మట్టి గణపతులే ముద్దు అంటూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా ధర్మాజీగూడెం శ్రీవిద్య హైస్కూల్‌లో వినాయక చవితి సంబరాలు నిర్వహించారు. ప్రకృతితో కూడిన మట్టి వినాయకుని విగ్రహం ప్రతిష్ఠించారు. విద్యార్థులు వినాయకుని ఆకృతిలో కూర్చొని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరత్నం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు



చింతలపూడి: విక్రయానికి సిద్ధంగా పలు ఆకృతుల్లో కొలువుదీరిన గణపతి విగ్రహాలు



పోలవరం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆర్ఎస్ రాజు



కొయ్యలగూడెం: గణనాథుడిని తరలిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

మోసానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



చింతలపూడి: బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

- ఎరువుల కొరతతో రైతుల ఇబ్బందులు
- పింఛన్లు రద్దు చేయడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శ

బుట్టాయగూడెం: మోసానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని నూతిరామన్నపాలెం, అచ్చియ్యపాలెం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం సర్పంచ్‌లు పొడియం లక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ చంద్రబాబు మాట ఒక అబద్ధమని, పరిపాలన ఒక మోసమని అన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి కూటమి కుయుక్తులు తెలియజేయాలని కోరారు.

పింఛన్లు తొలగించడం దారుణం

తాము అధికారంలోకి వస్తే రూ.4000 పింఛన్లు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. ఐదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించారన్నారు. పింఛనుదారులకు అండగా ఉంటామని వారి తరపున ఆందోళన చేపడతామన్నారు.

కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు

మండలంలోని అచ్చియ్యపాలెం, నూతిరామన్నపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాజీ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, సర్పంచ్‌లు ఉయికే బొజ్జి, బన్నే బుచ్చిరాజు, నాయకులు పొడియం లక్ష్మణరావు, నడింపల్లి కిరణ్‌వర్మ, పెంటపాటి శ్రీనివాస్, పూనెం వెంకటేష్, కలిదిండి విజయ్, మారిశెట్టి కిశోర్, కె.వెంకటస్వామి, రామకృష్ణ, అశోక్, అర్జున్, సామ్యూల్, శ్రీరామ్, ఎన్ఎస్‌వీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి

చింతలపూడి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని బోయగూడం గ్రామంలో మంగళవారం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కంభం విజయరాజు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో అధికార దాహంతో ప్రజలను మభ్యపెట్టి అమలుకు నోచుకుని పథకాలను ప్రకటించి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరావు, నాయకులు కొప్పుల నాగు, చిలుకూరి జ్ఞానారెడ్డి, మిరియాల దిలీప్, కె.చండీప్రియ, మాగసాని గురుబ్రహ్మం, ఎస్.కాంతారావు, రాజేష్ నాయు డు, ఆత్కూరి సుబ్బారావు, ఎస్.దుర్గారావు, వెంప కృష్ణ, గోలి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చవితికి ధరాఘాతం



జంగారెడ్డిగూడెంలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న ఓ పూల దుకాణం

జంగారెడ్డిగూడెం: వినాయక చవితి పండగను అందరూ ఏంతో ఆహ్లాదంగా నిర్వహించుకుంటారు. ప్రతి ఒక్కరూ గణనాథుడిని ఇంట్లో ఏర్పాటు చేసుకుని షోడషోపచారాలతో వారి శక్తి కొలది పూజించుకుంటారు. అయితే నేడు ఆ పూజకు కావాల్సిన పూజా సామగ్రి మాత్రం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి పూజకు అవసరమైన పండ్లు, పూలు గతేడాదితో పోల్చితే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయితే ఈ సారి ధరలు మెండుగా ఉండటంతో ప్రజలు, ఉత్సవాల నిర్వాహకులు తటపటాయించే పరిస్థితి ఏర్పడుతోంది. వినాయక చవితికి అవసరమైన పండ్లు వెలక్కాయ, మారేడికాయ, సీతాఫలం, జామకాయ వంటివి కాయ సైజును బట్టి రూ. 10 నుంచి రూ.30 వరకు అమ్ముతుండగా, పొత్తులు ఒక్కొక్కటి రూ.30 వరకు అమ్ముతున్నారు. ఇక పువ్వుల ధరలు సరేసరి, 100 గ్రాముల పువ్వులు రూ. 50కు విక్రయిస్తున్నారు. ఇక బంతిపూల దండలు అయితే దండ సైజును బట్టి రూ. 100 నుంచి అమ్మకాలు చేస్తున్నారు. కొబ్బరి కాయ రూ. 40, అరటిపండ్లు వాటి నాణ్యతను బట్టి హస్తం రూ. 80 నుంచి ఆ పైనే అమ్ముతున్నారు. ఇక పండ్ల ధరలు సరేసరి. సాధారణ రోజుల్లోనే అధికంగా ఉండే ధరలు పండుగ రోజును రూ. 10 నుంచి రూ. 20 వరకు పెంచి అమ్ముతున్నారు. అయినప్పటికీ ప్రజలు బొజ్జ గణపయ్య పూజ చేసుకునేందుకు తమ శక్తి కొలది వెచ్చిస్తున్నారు.

చవితి వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి

చవితి వేడుకల్లో నిర్వాహకులు ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలని, అధికారులు చవితి పందిళ్లను పర్యవేక్షించాలన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ యు.రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి, వీఆర్వోలు, సెక్రటరీలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రియాన్స్‌కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



కొయ్యలగూడెం: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొల్లూరు రియాన్స్ అనే బాలుడు చోటు సంపాదించాడు. కొయ్యలగూడేనికి చెందిన ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ కుమారుడైన కొల్లూరు రియాన్స్ చిన్న వయసులో జాతీయస్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. రాజమండ్రిలోని ప్రైవేట్ స్కూల్లో మూడవ తరగతి విద్యనభ్యసిస్తున్న ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన రియాన్స్ 101 కౌరవుల పేర్లు అతి తక్కువ సమయం 48.10 సెకండ్‌లో అనర్గళంగా వేగంగా చెప్పి అరుదైన జాతీయస్థాయి రికార్డుని నెలకొల్పాడు.

వరకట్న వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: భార్యను వేధిస్తున్న భర్త, ఆమె అత్తపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ బాబూరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం పాడిశెట్టి పావని లక్ష్మీప్రసన్నకు 2022లో శ్రీను అనే వ్యక్తి తో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 2లక్షలు కట్నం ఇచ్చారు. అయితే ఇటీవల శ్రీను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ప్రసన్నను అధికకట్నం భర్త, అత్త వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

మదర్ థెరీసాకు ఘన నివాళి



కొయ్యలగూడెం: మదర్ థెరీసా జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడి: మదర్ థెరీసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

కొయ్యలగూడెం: మదర్ థెరీసా జయంతి కార్యక్రమాన్ని మంగళవారం స్మైల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కొండముది దిలీప్ కుమార్ మదర్ థెరీసా సేవలు మానవత్వానికి ఒక మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. నేటి యువత ఆమె సేవలను కొనసాగించాలన్నారు. మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, బొబ్బర మంగరాజు, బొబ్బర చిట్టిబాబు, కడిమి నవీన్ కుమార్, పూలపాకుల దుర్గారావు, బి.సుబ్బారావు, టి.ఆనంద్, అశోక్ రాము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి: మదర్ థెరీసా జయంతిని చింతలపూడిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మదర్ థెరీసా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ, గోలి చంద్రశేఖర్ రెడ్డి, చిల్లపల్లి మోహన్ రావు, జల్లిపల్లి శివాజీ, ఎస్ఎస్ గాంధీ, గంధం చంటి, చుండూరు అబ్బయ్య, చిక్కాల సుధాకర్, బోను ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

లింగపాలెం: ప్రాథమిక పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖ అధికారి జంగం రవీంద్ర కోరారు. మంగళవారం మండలంలోని అయ్యప్పరాజుగూడెం పంచాయతీ ప్రగతిపురం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మలాల రామ్మోహన్ రావు ఉపాధ్యాయిని సంతోషం విద్యార్థులు పాల్గొన్నారు.